పాపపు చరిత్ర

బొమ్మిడి అచ్చారావు

"ఏక్సిడెంట్ ఎలా అయింది?" అడిగాడు డిటెక్టివ్ కిరణ్ అతన్ని. అతని కాళ్ళకు, కుడిచేతికి బేండేజి వుంది. ఇంకా అక్కడక్కడ చిన్న చిన్న గాయాలకు టింక్చర్ దూది అంటించి వుంది.

డిటెక్టివ్ కిరణ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అతని మంచం పక్కన కుర్చీల్లో కూచుని వున్నారు. శ్రీనివాస్ కాగితం పాడ్ తీసుకొని పాయింట్స్ నోట్ చేసుకుంటున్నాడు.

అతను నాలికతో పెదాలు తడి చేసుకుని చెప్పటం మొదలెట్టాడు.

"నా పేరు శశిధర్ సార్! నా ఫ్రెండు పేరు రవి. ఈ సాయంత్రం ఇద్దరం యాదగిరి గుట్టనుంచి నరసింహాస్వామిని దర్శించుకుని హైదరాబాదు వస్తున్నాం. సిటీ లిమిట్సులోకి వచ్చేస్తున్నాం. ఇంతలో ఎక్కడినుంచో భూతంలాంటి లారీ దూసుకు వచ్చేసింది. బుల్లెట్ రవి

నడుపుతున్నాడు. వెనక నే కూచున్నాను.

అప్పటికీ రవి చాలా కాషస్‌గా నే నడుపుతున్నాడు. కాని ఆ లారీ కావాలనే మామీదికి దూసుకువచ్చినట్టు నాకరమయింది. రవి పక్కకు తీశాడు. లారీ కూడా ఆ పక్కకే వచ్చింది. మళ్ళీ ఎడమపక్కకు కోశాడు బుల్లెట్. లారీ కూడా ఎడమపక్కకే వచ్చింది. మాకు యింకా పక్కకి వెళ్ళటానికి స్కోప్ కనిపించలేదు. పక్కన లోయ. కింద పెద్ద పెద్ద బండరాళ్ళు. బ్రేక్ కొట్టి ఆగి పోయాడు రవి. లారీ నిర్దాక్షిణ్యంగా మీదికి వచ్చేసింది. నేను కుడిపక్కకి గెంతి దూకేశాను. లారీ బుల్లెట్‌ని తొక్కేసి శరవేగంతో వెళ్ళిపోయింది. చేతులమీద అనుకున్నాను. కుడిచెయ్యి విరిగినట్టనిపించింది.

"ఇంతలో మా వెనక ఓ మెటడార్ వాన్ వచ్చి ఆగింది. వాళ్ళు నా పరిసితి చూసి వెంటనే వాన్‌లో వేసుకువచ్చి ఉస్మానియా హాస్పిటల్లో చేర్చారు. నాకు రెండు కాళ్ళకి స్వల్ప గాయాలు తగిలాయి. కాని కుడి చేయి ఫ్రాక్చరయిందని చెప్పారు" అన్నాడు శశిధర్.

"లారీ నంబరు చూశారా?" అడిగాడు శ్రీనివాస్.

"ఆ విపత్కర సితిలో ఆ ఆలోచనే రాలేదండి. రవి అక్కడికక్కడే మరణించిన విషయం నాకు దిగ్భ్రాంతి కలిగించింది. వాడికి భార్య, రెండేళ్ళ బాబు వున్నారు. వాళ్ళ పరిసితి తలుచుకుంటే నా కడుపు తరుక్కుపో యింది" శశిధర్ గొంతు బొంగురుపోయింది.

"అయితే యిది ఏక్సిడెంట్ కాదు, హత్య అంటారా?" అడిగాడు శ్రీనివాస్.

"నాకలాగే అనిపిస్తోంది సార్! నిజంగా యాక్సి డెంటల్‌గా జరిగితే లారీ బ్రేక్ వేసి వుండేవాడు. అలా

చెయ్యలేదు. కుడిపక్కగా లారీ తప్పుకు పోవటానికి కావలసిన దారికన్న ఎక్కువే జాగా వుంది. అయినా లారీవాడు మేము యెడమ పక్కకి తిప్పితే వాడూ ఎడమపక్కకే లారీ తిప్పాడు. మాకు కుడివైపు తిరగటానికి టైం లేదు. వాడికి తిరగటానికి చోటూ వుంది, టైమూ వుంది. అయినా మామీదికే లారీ నడుపుకు వచ్చాడంటే ప్రయత్నపూర్వకంగానే మమ్మల్ని హత్య చెయ్యటానికే అలా చేశాడనీ నాకనిపిస్తోంది" అన్నాడు శశిధర్.

"అంటే ఆ లారీ డ్రయివర్ మీ శత్రువయి వుండొచ్చు" అన్నాడు శ్రీనివాస్.

"అవును సార్! నాకూ అదే అనిపిస్తోంది."

"అయితే ఆ లారీ డ్రయివరు ఎవరో కూడా మీకీ సరికి గ్రహింపుకొచ్చి వుంటుంది" అన్నాడు కిరణ్.

శశిధర్ వెంటనే, "అదే అర్థంకావటంలేదు సార్! లారీ డ్రయివర్సు యెవరూ, నాకు తెలిసి, శత్రువులెవరూ లేరు" అన్నాడు.

"పోనీ మీ ఫ్రెండు రవికి....?"

"మాకిద్దరికీ కామన్‌గానే వున్నారు మిత్రులు, శత్రువులు కూడా! అందులో డ్రయివర్ ఎవరూ లేరు."

"డ్రయివర్ అంటే వృత్తిరీత్యా డ్రయివర్ కాకిపోవచ్చు. ఆ సమయానికి మీ శత్రువెవడో ఆ లారీ నడుపుతూ డ్రయివర్ స్థానంలో వుండవచ్చు కదా!" అన్నాడు కిరణ్.

శశిధర్ తలూపి, "అవకాశముంది సార్!" అన్నాడు.

"ఆ అవకాశం ఎవరికుంది?"

"అదే ఆలోచిస్తున్నాను సార్! ఓ మెకానిక్

వున్నాడు మలక్ పేటలో. ఆటో మొబైల్ షాపు నడుపు తాడు. అతను యిలా చేయటానికవకాశముంది. మోటారు ఫీల్డులోనే వున్నాడు కాబట్టి లాగీ ఏదోకటి అందు బాటులో వుంటుంది కూడా" అన్నాడు శశిధర్.

"అతని పేరు?"

"యల్లమంద."

"అతనితో మీ కెందుకు విరోధం వచ్చింది?"

"ఓసారి రవి మోటార్ బైక్ అతనికి సర్వీసింగ్ కిచ్చాడు. అతను మంచి పార్ట్సు తీసేసి అవన్నీ రిపేరు కొచ్చాయని చెప్పి రవి దగ్గర పెద్ద మొత్తంలో ఛార్జి చేశాడు. ఆ విషయంలో వాళ్ళిద్దరు ఘర్షణపడ్డారు. బుల్లెట్ అతని దగ్గరే వదిలేసి నాకు ఫోన్ చేశాడు ఆఫీసుకి. ఇద్దరం వెళ్ళి అలా ఎందుకు చేశావని అడిగాం. తక్కిన మెకానిక్కు కూడా యల్లమందకే వత్తాసు వచ్చారు. పెద్ద గొడవయ్యింది. యల్లమంద యిష్టమొచ్చి నట్లు మాట్లాడాడు.

చివరికి నేనే అతనడిగినంత యిచ్చి పడేసి బయట పడమని మా వాడికి చెప్పాను. ఇద్దరం బయటికొస్తూంటే యల్లమంద ఏదో తిట్టడం మాకు వినిపించింది. రవి దుడుకుగా వెనక్కి వెళ్ళబోతే నేనే వారించి బయటికి తీసుకొచ్చాను. రవి కూడా నోటికొచ్చినట్లు తిట్టాడు. ఆ కసితో వాడు పగబట్టి యిలా చేసి వుండవచ్చును" అన్నాడు శశిధర్.

శ్రీనివాస్ రికార్డు చేసుకుంటున్నాడు.

డిటెక్టివ్ కిరణ్ శశిధర్ చెప్పినది శ్రద్ధగా విన్నాడు.

"ఇది జరిగి ఎన్నాళ్ళయింది?"

"ఓ నెల కావచ్చును."

"నెల తర్వాత చిన్న విషయానికి మీమీద కక్షకట్టి ఏక్సిడెంట్ చేస్తాడంటారా?" అన్నాడు కిరణ్.

"వాడి తత్వం చూడబోతే బాగా గూండాలా వున్నాడు సార్! వాళ్ళంతా దొంగలు. మోసంచేసి సంపాదిస్తున్నారు. మేము సాధారణంగా అక్కడ రిపేరుకివ్వం. కాని, ఆ రోజు సడన్‌గా రవి బుల్లెట్ ఆ షాపు దగ్గర్లో ట్రబులివ్వటంవల్ల తప్పనిసరిగా వాడికి చూపించాడు."

"అంతకుముందు యెల్లమందతో పరిచయం లేదా?"

"లేదు సార్! రవి, నేను కూడా వుంటున్నది కాలి వాహన నగర్లో. మలక్‌పేటలో స్నేహితుల్ని చూడటానికి రవి ఆ రోజు ఒక్కడే వెళ్ళాడు. అతనికి ఆ రోజు వీక్లీ ఆఫ్. నాకు ఆఫీసుండడంవల్ల నేను వెళ్ళలేదు. సాధారణంగా మేమిద్దరం కలిసే వెళుతుంటాం. చెప్పాను కదండీ, మా యిద్దరి స్నేహితులు కామన్‌గానే వుంటారని!"

"అయితే యెల్లమంద నెలరోజుల తర్వాత నిన్న మీమీద కక్షతో చంపటానికి లారీ నడుపుకుని వచ్చి ఏక్సిడెంట్ చేసివుంటాడని మీ అనుమానం. అవునా?" అన్నాడు శ్రీనివాస్.

"అవును సార్! అవకాశముందంటున్నాను,"

"ఓ.కే. మేము దర్యాప్తు చేస్తాం. ఇంకా మీ దృష్టిలో ఎవరిమీదనైనా అనుమానముంటే చెప్పండి" అన్నాడు కిరణ్.

శశిధర్ ఏదో ఆలోచించి, "నా పర్సనల్ శత్రువు ఒకతను ఉన్నాడు సార్! అతని పేరు చైతన్య. సంజీవరెడ్డి నగర్‌లో వుంటాడు" అన్నాడు.

"అతనే విధంగా శత్రువు?"

"చైతన్య ఓ విధంగా మా దూరపు బంధువు. అతనికో చెల్లెలుంది. ఆమెని నేను చేసుకోవటానికి ప్రపోజ్ చేశాడు. నేను తిరస్కరించాను."

"అంతమాత్రాన...."

"అంతేకాదు సార్! చైతన్య మేనమామ మా ఆఫీసులో మేనేజర్ గా వున్నాడు. నేను అతని చెల్లెల్ని చేసుకోలేదని కక్షతో ఆ మేనేజర్ బంధువును నియోగించి నన్ను ఉద్యోగ బాధ్యతల్లో ట్రీజ్ చేసి, నాచేత కమిట్ మెంట్స్ చేయించి నన్ను డిస్మిస్ చేయించాలని చాలా విధాల ప్రయత్నించాడు కాని, చాలా మెలకువగా ఆ గండాలన్నీ తప్పించుకున్నాను. ఓసారి ముఖాముఖి కలిసి, అతని దురాలోచనల్ని బయటపెట్టి బాగా మందలించాను. బాగా ఘర్షణపడ్డాం. నా అంతు చూస్తానని బెదిరించాడు. నేనూ ఊరుకోలేదు. బాగా తిట్టాను. బుస కొట్టి వెళ్ళిపోయాడు. సమయం చూసి ఇలా చేశాడేమో ననిపిస్తోంది.

"అలా అయితే మీ ఒక్కర్నే చంపాలని ప్రయత్నిస్తాడు. రవిని కూడా ఎందుకు అంత మొందించాలనుకుంటాడు?"

"విడిగా అవకాశం దొరికి వుండదు. నిన్నతను కూడా యాదగిరి గుట్టలో మాకు కనిపించాడు. మధ్యాహ్నం తిరిగొచ్చేసరికి కనపడలేదు. ఈలోపల లారీ ఏర్పాటు చేసుకుని మామీద దాడిచేసి వుండొచ్చు."

కిరణ్ తల పంకించాడు. శ్రీనివాస్ నోట్ చేసుకుంటున్నాడు.

"చైతన్య ఏం చేస్తుంటాడు?"

"సనత్ నగర్‌లోని సైక్లు, మోటార్ విడి భాగాలు తయారుచేసే కంపెనీలో పర్సనల్ అసిస్టెంటుగా పని చేస్తాడు. నివాసం కూడా అక్కడే దగ్గర్లో వున్న స్వామి థియేటర్ వెనక సందులో వుంటాడు."

శ్రీనివాస్ రాసుకున్నాడు.

"ఇంకా ఎవరిమీదనైనా అనుమానముంటే చెప్పండి" అన్నాడు.

"మా వీధిలో వుంటున్న జేమ్స్ అనే అతనితో ఓ సారి నేను బాగా గొడవపడ్డాను. అతని చెల్లెలు లూసీ ఒకప్పుడు నా కోసం వల విసిరింది. నేను బ్రహ్మచారినని తెలిసి నన్ను వల్లో వేసుకోవటానికి ప్రయత్నించింది. ఆమె అంటేనే నాకు ఎలర్జీ. ఎన్నడూ ఆమె మొహం వంక దీక్షగా చూసి ఎరగను.

"ఓ రోజు వీధి చివర్లో వున్న కమ్యూనిటీ హాలుదగ్గిర రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో దారికాసి నా మీద పడింది. నేనంటే తన కెంతో యిష్టమనీ నన్ను పెళ్ళి చేసుకోమనీ ఇంకా ఏవేవో ప్రేమ పురాణాలు విప్పింది. నేను చిరాకుపడ్డాను. చెయ్యి పట్టుకుంది. విడిపించుకో బోతే మీదపడి గట్టిగా కావలించుకుంది. నేను అసహ్యించుకుని, వదిలించుకుని నా రూం కొచ్చి పడ్డాను. నా మీద పగబట్టిందామె.

ఆ మర్నాడు జేమ్స్ ఓ కత్తిపుచ్చుకుని నా గదికొచ్చి తలుపు తట్టాడు. నేను వాడి చెల్లెల్ని పాడుచేయటానికి ప్రయత్నించాననీ, నా లాంటివాడు ఆ వీధిలో వుంటే ఎన్నో సంసారాలు నాశనమయిపోతాయనీ అందుకని నన్ని భూమ్మీద వుంచటం తన కిష్టంలేదనీ కత్తి పై కెత్తాడు. సమయానికి రవి, చుట్టుపక్కల వాళ్ళు వచ్చి

అతన్ని పట్టుకోకపోతే అతను నన్ను చంపేసేవాడే!" అన్నాడు శశిధర్.

"అంటే లూసీ లేనిపోనివి చెప్పి అన్నను మీపై పురి కొల్పిందంటారా?" అడిగాడు శ్రీనివాస్.

"అవును సార్! ఆమె వట్టి తిరుగుబోతు. మా వీధిలో అందరికీ తెలుసు ఆమె సంగతి. అందుకని తప్పు నాది కాదని అందరూ అభిప్రాయాని కొచ్చారు. జేమ్స్‌ని మందలించి పంపేశారు. ఆ సమయంలో జేమ్స్ బాగా తప్ప తాగున్నాడు. తప్పంతా అతనిదేనని మందలించి పంపేశారు. మరోసారి ఇలా కత్తులూ కటారులూ తెచ్చి మనుషులమీద పడితే ఊరుకునేదిలేదని వార్నింగిచ్చారు. జేమ్స్ వాళ్ళింట్లోకి పోతూ చూసిన విషపు చూపు యిప్ప టికీ మరచిపోలేదు నేను" అన్నాడు శశిధర్.

"జేమ్స్ ఏం చేస్తుంటాడు?"

"అతని తత్వానికి సరిపోయినదే! మాలాలీలో ఓ లిక్కర్ కంపెనీలో పని నిస్తాడు. ఎప్పుడూ లోడ్‌లో వుంటాడు. మామూలుగా అతన్ని చూడం" అన్నాడు శశిధర్.

"మీ ఫ్రెండు రవి ఎక్కడ పని చేసేవారు?"

"అతను ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్‌లో టెక్నికల్ అసిస్టెంటుగా చేసేవాడు. బి.యి. మెకానికల్. మంచి భవిష్యత్తున్నవాడు. ఈ లోపల విధి చిన్న చూపు చూసింది" అన్నాడు శశిధర్.

కిరణ్ శ్రీనివాస్ వంక చూసి, "ఏక్సిడెంట్ స్పాట్ చూద్దామా?" అనడిగాడు.

"అలాగే! నేను చూశాను. బుల్లెట్ తుక్కయి

పోయింది! లారీ టైరు గుర్తులు తప్ప అక్కడేం కనిపించ లేదు. మెటడార్ వాన్ డ్రయివర్ కూడా యీాయన్ని హాస్పిటల్లో చేర్చి అర్జంటుగా వెళ్ళిపోయాడు. విట్నెస్ గా ఉండాల్సి వస్తుందని అభిప్రాయపడి వుంటాడు" అన్నాడు శ్రీనివాస్.

కిరణ్ శశిధర్ వంక చూసి, "మీ బంధువు లెవరూ లేరా యిక్కడ? యెవరూ వచ్చిన జాడలేదు...." అన్నాడు.

"మా వూరు కడపజిల్లా మైదుకూరు సార్! అక్కడ మా తల్లి, తమ్ముడు వున్నారు. తమ్ముడుకి చదువంటలేదు. అక్కడే ఓ ఫ్యాన్సీషాపు నడుపుతున్నాడు. అక్కలూ, చెల్లెళ్ళూ, అన్నలూ యెవరూ లేరు...." అన్నాడు శశిధర్.

"మీరింకా పెళ్ళి చేసుకోలేదా?"

"ఈ సంవత్సరం ప్రపోజల్ వుంది సార్! ఉద్యోగం యింకా పర్మనెంట్ కాలేదని యిన్నాళ్ళు ఆగాను. గత జనవరిలోనే ప్రొబేషన్ డిక్లరేషన్ అయింది" అన్నాడు శశిధర్.

"ఓకే! మంచి విషయాలు చెప్పారు. మీ రింకా హాస్పిటల్లో ఎన్నాళ్ళుండాలన్నారు?"

"ఓ పదిరోజులదాకా పేషెంట్ కదలటానికి వీల్లేదండి! చేయికి ఫ్రాక్చరయింది. మరో పదిహేనురోజుల తర్వాత సిమెంటు కట్టు విప్పి వేరే కట్టు వేయాలి" చెప్పాడు అప్పుడే అక్కడికి వచ్చిన డాక్టరు.

"ఆల్ రైట్! అవసరమయితే మళ్ళీ కలుస్తాం" అని లేచాడు డిటెక్టివ్ కిరణ్. శ్రీనివాస్ అనుసరించాడు.

2

"రవి మిసెస్‌ని కలుసుకుంటే మనకి కొన్ని ముఖ్యమయిన విషయాలు తెలుస్తాయి" అన్నాడు డిటెక్టివ్ కిరణ్.

కిరణ్, శ్రీనివాస్ పోలీసు స్టేషన్‌లో కూచుని వున్నారు.

"ఆ అవకాశం యిప్పట్లో లేదు...." అన్నాడు శ్రీనివాస్. భర్త మరణం ఆమెకి షాకిచ్చినట్టుంది. ఎవరితోనూ మాట్లాడటం లేదు. వెర్రిచూపులు చూస్తోంది. బహుశా కొన్నాళ్ళవరకూ కుదుటపడదనుకొంటాను."

"అలాగా! ఇప్పుడామె ఎక్కడుంది?"

"ఆమె తండ్రి వాళ్ళ వూరు తీసుకుపోయాడీ రోజు. మళ్ళీ దినకార్యాలకు యిక్కడికే వస్తారనుకుంటానంతే!"

"నువ్వు ఏక్సిడెంట్ స్పాట్ చూశావు కదా? వివరాలు చెప్పు! శశిధర్ చెప్పినదానికీ, నువ్వు చెప్పినదానికీ ఏదయినా తేడా వుందా?"

"ఏం లేదు! బుల్లెట్ యెడమవైపుగా దొర్లిపోయి వుంది. రోడ్‌కి యెడమపక్క ఓ పెద్ద లోయ వుంది. ఎడమవైపు రోడ్ మార్జిన్‌లో లారీ టైర్ల గుర్తులు కనిపించాయి. అక్కడ రోడ్ మట్టి పోసివుంది—ఎర్రటి మట్టి. కుడివైపుగా రోడ్ చాలా ఉంది. అయినా లారీ ఎడమవైగా వెళ్ళాల్సిన అవసరం లారీవాడికెందుకొచ్చింది? దీన్నిబట్టి ఆ లారీ డ్రయివర్ కావాలనే వాళ్ళమీదకు లారీ తోలినట్టు స్పష్టంగా తెలుస్తోంది!"

"చైతన్య, యల్లమంద, జేమ్సుల ఎలిబీలు గురించి

ఎంక్వయిరీ చేయించు. వాళ్ళు ముగ్గురూ ఏక్సిడెంట్ జరిగిన సమయంలో యెక్కడెక్కడున్నారో కనుక్కో"
అన్నాడు డిటెక్టివ్ కిరణ్.

3

ఫోన్ గణగణ మోగింది.

"హాల్లో, డిటెక్టివ్ కిరణ్ హియర్!"

"వెంటనే స్టేషన్‌కి రా బ్రదర్! చైతన్య ఏక్సిడెంట్‌లో చనిపోయాడు."

"చైతన్యా? ఏక్సిడెంట్లోనా?"

"అవును! లారీ ఏక్సిడెంట్! సనత్‌నగర్ మెయిన్ రోడ్‌న లారీ అతని స్కూటర్‌ని డాష్ యిచ్చిందట. స్పాట్ డెత్!"

"వాట్ ఏ ట్రాజడీ!? లారీవాడు పారిపోయాడా?"

"ఆc! ట్రాఫిక్ కానిస్టేబులు నంబరు నోట్ చేశాడు. నువ్వు వెంటనే రావాలి!"

"ఇప్పుడే వస్తున్నా!"

కిరణ్ డ్రస్ చేసుకుని చకచక బయటికి వచ్చి పోర్టికోలో నుంచి టయోటా బయటికి తీశాడు.

పదినిమిషాల్లో స్టేషన్ ముందున్నాడు కిరణ్.

"నీ టయోటా యిక్కడ వదిలెయ్యి. ఇద్దరం మా బలగంతో జీపులో పోదాం" అన్నాడు శ్రీనివాస్.

మరో యిరవై నిమిషాల్లో పోలీసు జీపు సనత్‌నగర్లో ఏక్సిడెంట్ స్పాట్‌లో వుంది.

స్కూటర్ ముందు చక్రం వంపు తిరిగిపోయింది. వెనక చక్రం అణగిపోయింది.

స్కూటర్‌కి రెండు గజాల అవతల తలభాగం నుజ్జునుజ్జయిపోయిన శవం. చూసే వాళ్ళకి భీతికొలిపేలా

వుంది.

సార్జంట్ శివం యిన్‌స్పెక్టర్‌కి శాల్యూట్ చేసి "రెప్పపాటులో లారీ మాయమయి పోయింది సార్! ఎర్ర రంగు బెంజి మెర్సిడెస్ బండి. నంబర్ ట్రాఫిక్ కానిస్టేబిలు నోట్ చేశాడు; ఎ. డి. వై. 3631" అన్నాడు.

అప్పటికే బాగా గుంపు చేరింది. పోలీసులు కంట్రోలు చేయలేక సతమతమవుతున్నా.

కిరణ్ ఆ ప్రదేశాన్నంతా పరీక్షగా చూస్తున్నాడు. సాయంత్రం అయిదున్నర కావస్తోంది. ఈ సమయంలో పబ్లిగ్గా ఏక్సిడెంట్ చేసి అందరి కళ్ళు కప్పిపోయిన ఆ లారీడ్రయివర్ చాకచక్యానికి, గుండె నిబ్బరానికి ఆశ్చర్య పోతున్నాడతను.

"కావాలని చేసిన ఏక్సిడెంటు. రవి విషయంలోను యిలాగే జరిగింది కదా! బహుశా హంతకుడు కూడా ఒకడే అయ్యుండాలి" అన్నాడు శ్రీనివాస్.

కిరణ్ తల పంకించాడు.

"ఇతను చైతన్య అని ఎవరు గుర్తుపట్టారు?" అడిగాడు కిరణ్.

"ఇదిగో సార్, యీాయన డైరీ. స్కూటరు ఎటాచీ లోంచి యెగిరిపడింది. ఈయన పనిచేస్తోన్న ఫ్యాక్టరీ యిక్కడే కదా! అతని కొలీగ్స్, వర్కర్స్ గుర్తుపట్టి చెప్పారు. అంత క్రితమే యితని వివరాలు డైరీవల్ల తెలి శాయి. అందుకే సార్‌కి ఫోన్ చేసి పేరుతో సహా వివ రాలు చెప్పాను" అన్నాడు సార్జంట్ శివం.

"ఏక్సిడెంట్ చూసిన ప్రత్యక్ష సాక్షు లెవరయినా వున్నారా?" అడిగాడు కిరణ్.

"ఇదిగో, యీాయన చూశాడు సార్!" అన్నాడు శివం ఓ నడివయసు మనిషిని చూపించి.

అతను ముందుకొచ్చి "నా పేరు నరసింహం సార్! యీా పాన్ షాప్ నాదే! సాయంత్రం నాలుగు గంటల ప్రాంతాన యీాయన యిటునుంచి స్కూటర్ మీద వస్తు న్నాడు. అటు నుంచి లారీ వస్తోంది. సడన్‌గా పెద్ద శబ్దమయింది. అటు చూసేసరికి లారీ స్కూటర్‌ని కొట్టేసి స్కూటర్ మీదుగా మనిషిని తొక్కేసి యమ స్పీడుగా వెళ్ళిపోయింది" అన్నాడు.

"లారీ నా ముందునుంచే పరుగెత్తింది. నేను విజిల్ వేసి ఆపటానికి ప్రయత్నించాను. కాని ఆగలేదు. వెంటనే నంబరు నోట్ చేసి సార్జంటుకి తెలియచేశాను" అన్నాడు ట్రాఫిక్ కాన్‌స్టేబిల్.

చైతన్య బంధువులు శోకాలు పెడుతూ వచ్చి చేరా రక్కడికి. ఓ ముసలావిడ, యిరవై యేళ్ళ యువతి, ఓ పదహారేళ్ళ కుర్రాడు వచ్చారు.

ముసలామె చైతన్య తల్లిగాను, ఆ యువతి చెల్లెలు గాను, కుర్రాడు తమ్ముడిగాను ఊహించాడు కిరణ్. శశి ధర్ చెప్పిన అమ్మాయి ఆమే అయివుండాలి. ఆమెవంక పరిశీలనగా చూశాడు కిరణ్. దుఃఖంతో ఆమె ముఖం బాగా కమిలిపోయి ఎర్రగా వుంది. ఓ విధంగా ఆమె అందగత్తె అనే చెప్పాలి. శశిధర్ ఆమెను ఎందుకు చేసుకోనన్నాడో అర్థంకాదు.

పోలీసులు వాళ్ళని శవం దగ్గరికి వెళ్ళనివ్వలేదు.

ఫోటోగ్రాఫరు, వేలిముద్రల నిపుణుడు తమ పనుల్లో మునిగి వున్నారు.

డాక్టరు పరీక్ష ముగించి లేచి కిరణ్ శ్రీనివాస్‌లని

సమీపించి, "హెడ్ ఇంజరీ. ఇమ్మిడియేట్ డెత్. లారీ దెబ్బ, రోడ్ దెబ్బ కూడా తగిలాయి. వెంటనే ప్రాణం పోయింది" అన్నాడు.

ముసలామె దుఃఖంనించి కొంత తేరుకొన్నాక కిరణ్ ఆమెని పలకరించాడు.

"ఇతను మీ అబ్బాయి చైతన్యనా?" అని.

ఆమె పొంగిపొరలే దుఃఖాన్ని నిగ్రహించుకుంటూ "అవును బాబూ! మధ్యాహ్నం అన్నం తిని వెళ్ళాడు బిడ్డ. ఇప్పుడు యింకా యింటికి చేరకుండానే దారిలోనే దేవుడెత్తుపోయాడు" భోరున ఏడ్చేసింది.

"ఈ అమ్మాయి ఎవరు?"

"నా కూతురు విమల బాబూ! వీడు నా రెండో కొడుకు శేఖరం. టెన్త్ రాశాడు. వీళ్ళిద్దరి భవిష్యత్తు గాలికొదిలేసి తన దారి తను చూసుకున్నాడు."

"ఇలా అడుగుతున్నందుకు అన్యథా భావించకండి! మీకు శశిధర్ అనబడే బంధువు వున్నాడా?"

"ఉన్నాడండి! అసలు అతనికిచ్చి చెయ్యాలనుకున్నాం విమలని."

"మరెందుకు చెయ్యలేదు?"

"కట్నం ఆశ బాబూ! పదిహేనువేలు కట్నమడిగాడు. ఎక్కడనించి తెచ్చేది? మా వాడికి కంపెనీవాళ్ళు యిచ్చే జీతం మా కుటుంబ పోషణకే చాలదు. ఈ స్కూటర్ కూడా కంపెనీ వాళ్ళిచ్చినదే! ఇప్పుడు వున్న యీ ఒక్క ఆధారమూ పోయింది. మేమంతా వీధిన పడాల్సిందే!" ముసలామె కంఠం మళ్ళీ పూడుకుపోయింది.

ఆమెని యింకా కదిలించటానికి మనస్కరించ లేదు

కిరణ్‌కి.

శ్రీనివాస్ ఆమెకి శవాన్ని మార్చ్యురీవద్ద అప్పగిస్తానని చెప్పి పంపేశాడు. చైతన్య చెల్లెలు, తమ్ముడు తల్లి వెంట దుఃఖిస్తూ వెళ్ళిపోయారు.

శవాన్ని మార్చ్యురీకి తరలించాక స్టేషన్‌కి తిరిగొచ్చారు కిరణ్, శ్రీనివాస్‌లు.

4

యల్లమంద, జేమ్స్‌ల ఎలిబీలు ఎంక్వయిరీ చేశావా!?" అడిగాడు కిరణ్.

"ఆఁ, చెప్పటం మరిచాను. యల్లమంద రెండు రోజులుగా షాపు తెరవటంలేదు. జేమ్స్ నిన్నమధ్యాహ్నం రెండు గంటలనుంచి రాత్రి పది గంటలవరకూ మాలాలీ లిక్కర్ ఫ్యాక్టరీలో వున్నాడని ఫ్యాక్టరీవాళ్ళు నిర్ధారణగా చెప్పారు."

"మరి యీ రోజు కలిశావా?"

"లేదు. ఈ రోజు కూడా ఫ్యాక్టరీకి పోయాడు. రాత్రి పదిగంటల కొస్తాడని వాళ్ళ చెల్లెలు లూసీ చెప్పింది."

"లూసీ ఎలాంటి పిల్ల? వెకిలిగా వుందా? శశిధర్ చెప్పిన లక్షణాలేమయినా...."

"నేను మాట్లాడిన పది నిమిషాల్లోనూ బాగా నే ప్రవర్తించింది మరి! కాసేపట్లో ఆమె గురించి యేం తెలుస్తుంది?"

"ఎంక్వయిరీ చేయకపోయావా?"

"మన పని జేమ్స్‌తోగాని ఆమెతో కాదుగదా అని చెయ్యలేదు."

"అదే పొరపాటు. శశిధర్ చెప్పిన విషయాలని

దృష్టిలో పెట్టుకుని అన్ని కోణాలనించి మన దర్యాప్తు చేస్తూండాలి. ఆ వీధిలోని వాళ్ళని కదిపి చూడాల్సింది. ఒకప్పుడు లూసీ శశిధర్‌ని అల్లరిపెట్టడం, జేమ్స్ కత్తి దూసి అతని యింటిమీద పడటం — ఇవన్నీ మనకి కావలసిన యిన్ఫర్మేషన్‌లో భాగమే కదా!"

శ్రీనివాస్ బుర్ర గోక్కున్నాడు.

"సరే, అనుమానితుల లిస్టులో మొదటివాడు యల్లమంద దొరకలేదు. ఇంటిదగ్గర ఎంక్వయిరీ చేయించావా?"

"ఆc! వాళ్ళకీ తెలీదుట. మొన్న సాయంత్రం నించి యింటికొక్కూడా రాలేదుట. షాపు కూడా తెరవటం లేదు."

"గుడ్! రెండో అనుమానితుడు చైతన్య శవంగా మారిపోయాడు. మూడోవాడు జేమ్స్‌ని ఫ్యాక్టరీ దగ్గర కలిసి ఎంక్వయిరీ చేసి వుండాల్సింది!"

"రాత్రి పదిగంటల కొస్తాడుగా! వెళ్దామా అప్పుడు?"

కిరణ్ అందుకు సమాధానం చెప్పకుండా "ఎర్ర రంగు వెంజిలారీ యెవరిదో వివరాలు సేకరించావా?" అన్నాడు.

"ఇంకా లేదు. యెవరిదో తెలియదు. నంబరు తప్పుగా రాసి వుండొచ్చు కదా!" అన్నాడు శ్రీనివాస్.

"ముందు మెసేజ్ పంపించు. లారీ సిటీ లిమిట్సులోంకి వెళ్ళిపోయి వుండదు. నా అనుమానం నిజమయితే దాన్ని ఏదో గరాజ్‌లో రహస్యంగా దాచి వుంచవచ్చు" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ సార్జంటు శివాన్ని పిలిచి చెప్పాడు.

ఇంతలో ఫోన్ గణగణ మోగింది.

శ్రీనివాస్ ఎత్తి "హల్లో క్రైం బ్రాంచ్" అన్నాడు.

మెసేజ్ వింటున్న శ్రీనివాస్ ముఖం గంభీరంగా అయింది. దవడ కండరాలు బిగుసుకున్నాయి.

ఫోన్ పెట్టేసి, "మరో యాక్సిడెంట్. లారీ ఆటోని కొట్టింది. ఆటో డ్రైవరు, ప్రయాణం చేస్తున్న ఓ యువకుడు చనిపోయారు స్పాట్‌లోనే. లారీ దొరక్కుండా తప్పించుకుపోయిందట. ఎర్ర రంగు బెంజిలారీ. కానీ నంబరు మారిపోయింది. ఎ.ఎస్.వై. 4226. సార్జంటు రాజు ఫోన్ చేశాడు" అన్నాడు శ్రీనివాస్.

కిరణ్ కుర్చీలో నిటారుగా కూచున్నాడు.

"లారీ అదే. నంబరు ప్లేటు మారిపోయింది" అన్నాడు కిరణ్. శ్రీనివాస్ తలపంకించాడు.

"కొంపదీసి హంతుడు జేమ్స్ కాదు గదా!" అన్నాడు శ్రీనివాస్ లేచి హేట్ సరిచేసుకుంటూ.

"స్పాట్ ఎక్కడా?" అడిగాడు కిరణ్.

"బేగంపేట రైల్వే క్రాసింగ్ దగ్గరగా" అన్నాడు శ్రీనివాస్ జీప్‌లో కూచుంటూ.

కిరణ్ కూచున్నాక జీప్ కదిలింది.

జీప్‌ని చూశాక గుంపు చెదిరింది.

ఆ దృశ్యం చూడగానే అర్థమయిపోయింది కిరణ్‌కి యాక్సిడెంట్ చేసినది ప్రయత్నపూర్వకంగా నేనని.

ఆటో ముందు భాగం చిత్తయిపోయింది. డ్రయివర్ లోపలి ప్రయాణీకుడు ఆటో లోపలే నొక్కుకుపోయి రక్తం కక్కుకుని చచ్చిపోయారు. లారీ ఆటో వెనుక భాగాన్ని తొక్కేసి వెళ్ళిపోయింది. యాక్సిడెంటల్‌గా జరిగివుంటే ముందు భాగం పాడయి వుండేది.

సార్జంటు రాజు శ్రీనివాస్ కి శాల్యూట్ చేసి, "హంతుడి నెవరూ గుర్తించలేదు సార్! ఆటో డ్రయివర్ ఖాసిం అనే పేరుగల వ్యక్తి అని యిక్కడ చేరిన ఒక రిద్దరు ఆటో డ్రయివర్స్ చెప్పారు. ప్రయాణం చేస్తున్న వ్యక్తినే ఎవరూ గుర్తించలేదు" అన్నాడు.

మెడికల్ స్టోర్స్ యజమాని తను చూసిన విషయం చెప్పుకొచ్చాడు. "బేగం పేట మీదుగా సికిందరాబాదు వెళ్తోంది లారీ. సికింద్రాబాద్ నుండి బేగం పేట్ వైపుగా ఆటో వస్తోంది. యెవరూ ఊహించని రీతిగా చాలా అకస్మాత్తుగా ఏక్సిడెంటయిపోయింది సార్! ఆటో చివరి క్షణంలో సైడుకి తీయబోయాడు గాని, లారీ అందుకు స్కోప్ ఇవ్వలేదు" అన్నాడతను.

కిరణ్ అతనకి ధన్యవాదాలు చెప్పాడు.

శ్రీనివాస్ సిబ్బందికి సూచనలిస్తున్నాడు.

5

"హంతుడ్ని గుర్తుపట్టారు. అతడి పేరు రాఘవులు. జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగం" అన్నాడు శ్రీనివాస్.

"ఎక్కడా?" అడిగాడు కిరణ్.

శ్రీనివాస్ చెప్పాడు.

"హంతుడి పేరు కొత్తగా వుంది. శశిధర్ చెప్పిన లిస్టులో లేవట్టుందే!" అన్నాడు కిరణ్.

"హంతకుడు మాత్రం ఒకడే, అనుమానం లేదు. మొగాడ్, ఒక్క రోజు వ్యవధిలో మూడు హత్యలా? పైగా అలావాటు ప్రకారం చేసుకుపోతున్నట్టు ఒకదాని తర్వాత మరొకటి అన్నీ లారీ ఏక్సిడెంట్స్! వీటికి అంతూ దరీ వుందా అనిపిస్తోంది" అన్నాడు శ్రీనివాస్ శూన్యం

లోకి చూస్తూ.

"లారీ విషయం తొందరగా ఎంక్వయిరీ చెయ్యి. బహుశా మూడు ఏక్సిడెంట్సుకీ ఒకే లారీ ఉపయోగించి వుండొచ్చునని నా అనుమానం" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ సార్జంట్‌ని పిలిచాడు.

కిరణ్ వాచ్ చూసుకుని, "పదిన్నరయింది. జేమ్స్ వచ్చివుంటాడు, పోదామా?" అన్నాడు.

శ్రీనివాస్ లేచాడు.

6

జేమ్స్ వుండే శాలివాహన నగర్ చేరారు కిరణ్, శ్రీనివాసులు.

జేమ్స్ అప్పుడే ఫ్యాక్టరీ నుంచి వచ్చాడు. పోలీసుల్ని చూసి వినయంగా ఆహ్వానించాడు.

కిరణ్ అతను తాగివున్నట్టు గ్రహించాడు.

"రవి చనిపోయాడు, ఆ విషయంలో మీతో కొన్ని విషయాలు మాట్లాడాలని వచ్చాం" అన్నాడు కిరణ్.

"అడగండి సార్!" అన్నాడు జేమ్స్.

"రవి యెలాంటివాడు? ఐమీన్, వ్యక్తిగతంగా! అతనికి గిట్టనివాళ్ళెవరున్నారు?"

జేమ్స్ వెంటనే, "రవి చాలా మంచిమనిషి సార్! అతని గురించి ఈ వీధిలో యెవర్నడిగినా చెప్తారు. తన పనేదో, తనేదో అన్నట్టుంటాడు. నాకు తెలిసి అతనంటే గిట్టనివాళ్ళు లేరు" అన్నాడు.

"అతన్ని ఎవరో యేక్సిడెంట్ చేశారని నిర్ధారణగా తెలిసింది. అతనితోబాటు శశిధర్ అనే అతని స్నేహితుడు కూడా బుల్లెట్ వెనక కూచుని వున్నాడు" అన్నాడు శ్రీనివాస్.

శశిధర్ పేరు వినగానే జేమ్స్‌లో వచ్చిన మార్పు గమనించాడు కిరణ్.

"అసలు శశిధర్ నే చంపటానికి చేసివుంటాడు సార్ యెవడో యేక్సిడెంటు! దురదృష్టవశాత్తు ఆ దెబ్బ మంచి వాడైన రవిని కొట్టేసింది."

"శశిధర్ నే చంపటానికి చేశాడని యెలా చెప్ప గలరు?"

"శశిధర్ వ్యక్తిగతంగా మంచివాడు కాదు సార్! రవికి స్నేహితుడిగా తగినవాడు కాదు."

"మంచివాడు కాదంటే....?"

"చెప్పకూడదు గాని, ఓసారి నా చెల్లెలిమీద చెయ్యి వేశాడు సార్! చాలా దుర్మార్గుడు."

"అప్పట్లో మీరతన్ని చంపబోయారని..."

"నో, నో, సార్! నేనలాంటి దుడుకు మనిషినికాదు. నా చెల్లెల్ని అలా చెయ్యొచ్చా అని అడగటానికి అతని గదికి వెళ్తే తనని చంపటాని కొచ్చానని పెద్ద రగడ చేశాడు సార్ శశిధర్!"

"అయితే మీరు కత్తి చూపించి బెదిరించిన విషయం నిజం కాదంటారా!?"

"కత్తి చూపించిన మాట నిజమే గాని, చంపాలని నా ఉద్దేశంకాదు సార్! మందలించాలనే అలా చేశాను" అన్నాడు జేమ్స్.

"మీ చెల్లాయి వున్నారా లోపల?"

"ఉన్నది సార్, పిలుస్తాను" అని లోపలికి చూసి "లూసీ!" అన్నాడు జేమ్స్.

ఇరవై రెండేళ్ళ యువతి బయటికొచ్చింది. చామన ఛాయల్లో నిండుగా వుంది. మెడలో శిలువతో వున్న

బంగారు చెయినుంది.

"మిమ్మల్ని ఓ విషయం అడగాలి. ఇదివరలో శశిధర్‌తో మీరు అసభ్యంగా ప్రవర్తించినట్టు, అతను మిమ్మల్ని మందలించినట్టు, తర్వాత మీ అన్నయ్య శశిధర్ మీద బలప్రయోగం చేయబోయినట్టు తెలిసింది. దానికి మీ సంజాయిషీ ఏమిటి?" అన్నాడు శ్రీనివాస్.

లూసీ ఏడుపు మొహం పెట్టింది.

"అంతా ఉత్తది సార్! అతనే నా వెంటబడి వేధించాడు. మా అన్నతో అతని గురించి చెప్పాను—అన్న బెదిరించాలని అతని గదికి వెళ్ళాడు. అంతే! దానికే అతను జనాన్ని పిలిచి పెద్ద యాగీ చేశాడు" అన్నదామె.

కిరణ్‌కి ఆమె మాటల్లో పూర్తిగా అబద్ధం లేదనిపించింది—మనిషి వెకిలిగా లేదు. మరి శశిధర్ చెప్పినదాన్ని బట్టి చూస్తే తప్పెవరిది?

"నిన్న మధ్యాహ్నంనించి సాయంత్రం ఆరుగంటల వరకూ మీ రెక్కడున్నారు?" అడిగాడు కిరణ్ జేమ్స్‌ని.

"నేను డ్యూటీలో వున్నాను సార్! 'బి' షిఫ్టు. మధ్యాహ్నం రెండు నుంచి రాత్రి పది. ఈ రోజుకూడా బి షిఫ్టే. ఓ అరగంట క్రితమే వచ్చాను" అన్నాడు జేమ్స్.

"శశిధర్ వుండేది యీ వీధిలోనే కదూ!"

"అవును సార్, అదిగో ఆ యిల్లే. పక్క యిల్లు రవిగారిది. ఈ రోజు ఉదయమే అతని భార్యని పుట్టింటివాళ్ళు తీసుకుపోయారు."

కిరణ్ లేచాడు—శ్రీనివాస్‌కి సైగ చేశాడు.

జేమ్స్, లూసీ నమస్కారాలు చేశారు.

కిరణ్ బయటికొచ్చాక, "ఈ చుట్టుపట్ల శశిధర్ గురించి కొంత యిన్ఫర్మేషన్ సేకరించాలి" అన్నాడు.

శ్రీనివాస్ కిరణ్ చెప్పిన సూచనలు విన్నాడు.

"శశిధర్ అబద్ధం చెప్పాడంటారా?"

"యేమో, చెప్పలేం. మనిషి నమ్మకస్తుడిలానే వున్నాడు. చైతన్య తల్లి చెప్పినదాన్నిబట్టి మాస్టే అతనికి డబ్బాశ వున్నట్టు తెలుస్తోంది. జేమ్స్, లూసీ చెప్పిందాన్నిబట్టి అమ్మాయిల వెంటపడే గుణమున్నట్టు తెలుస్తున్నది. రవిలాంటి మంచి చరిత్ర వున్నవాడు శశిధర్ మంచివాడు కాకుంటే స్నేహం చేస్తాడా?"

జీపు పోలీసుస్టేషను దగ్గర ఆగింది.

కిరణ్ తన టయోటా స్టార్టుచేస్తూ "ఉదయం వస్తాను. నేను చెప్పిన విషయాలు యెంక్వయిరీ చేయించు" అన్నాడు.

7

నిద్రమంచంమీద నుండే ఫోన్ అందుకున్నాడు డిటెక్టివ్ కిరణ్. లైన్లో శ్రీనివాస్ వున్నాడు.

"లారీ కనిపించింది బ్రదర్!"

"ఎక్కడ?"

"దిల్షుక్‌నగర్ రోడ్‌న దొరికింది. దాంట్లో ఎవరూ లేరు. నంబరు ప్లేటు లేదు."

"లారీ వదిలేసినవాడు నంబరు ప్లేటు విషయంలో ఎందుకు జాగ్రత్త తీసుకున్నాడు?"

"ఏమో, అర్థంకాలేదు. వేలిముద్రల నిపుణుడ్ని పంపించాను. నువ్వు వస్తావా, వెళ్దాం."

"అసలు ఆ లారీయే అని యెలా నిర్ధారించావు?"

"బెంజ్ మెర్సిడెస్. ఎర్ర రంగు. మెడికల్ స్టోర్సు ఆసామిని, తీసుకెళ్ళి కన్ఫర్మ్ చేశాను. అంతే కాదు, లారీ టైర్లకు రక్తం నల్లగా అట్ట కట్టి అంటుకుని వుంది...."

"వెరీ గుడ్!"

"మరో ముఖ్యమయిన సమాచారం. యల్లమంద తిరిగొచ్చాడు. ఇప్పుడే అతన్ని స్టేషన్‌కి తీసుకొచ్చాను. ఎంత అడిగినా నిజం చెప్పటంలేదు."

"ఆల్‌రైట్ నే నొస్తున్నాను" అన్నాడు కిరణ్.

అలారం టైంపీస్ ఎనిమిది చూపిస్తోంది.

"అరె, బాగా పొద్దెక్కిందే!...." అనుకున్నాడు కిరణ్.

కిరణ్ టయోటా మరో అరగంటలో పోలీస్ స్టేషన్ ముందు నిలబడింది.

లోపల శ్రీనివాస్ యెవరో వ్యక్తిని నయానా భయానా ఏదో అడుగుతున్నాడు.

కిరణ్‌ని చూడగానే, "రా బ్రదర్! ఇతనే యల్లమంద. ఈ రెండురోజులూ తన అక్కగారింటికి వెళ్ళానంటున్నాడు" అన్నాడు శ్రీనివాస్.

కిరణ్ ఆ వ్యక్తివంక చూశాడు. అతడికి దాదాపు ముప్పయ్యేళ్ళుంటాయి.

"మలక్‌పేటలోని ఆటోమొబైల్ రిపేరింగ్ షాపు నీదేనా?"

"అవును సార్!"

"గతంలో రవి, శశిధర్ అనే యిద్దరు స్నేహితులతో మోటార్‌బైక్ విషయంలో ఘర్షణ పడ్డావు అవునా?"

"అది ఎప్పటి సంగతో సార్! నేను పార్టును మార్చేసి బిల్లు యెక్కువ చేశానని ఆయన నన్ను దొంగని చేసి మాట్లాడారు. నాకు బాధ తోచి బిల్లు యివ్వక్కర్లేదు, బండి తీసుకుని వెళ్ళమన్నాను సార్! అంతకు మించి ఏం ఘర్షణ లేదు. ఆ తర్వాత ఆ సంగతే పూర్తిగా మర్చిపోయాను సార్!"

"మొన్న, నిన్న నీవు వూళ్ళోనే వున్నావా?"

"లేను సార్! మా అక్కగారి వూరు జడ్చర్ల వెళ్ళి యీ తెల్లవారు ఝామునే తిరిగొచ్చాను. నే నొచ్చేసరికే నా గురించి పోలీసులు తయారుగా వున్నారు. వెంటనే నన్ను పట్టుకుని వచ్చారు."

"నువ్వు నిజంగా జడ్చర్లలోనే వున్నట్లు రుజువు చేసుకోగలవా?"

"చేసుకుంటాను సార్! అక్కడ భూమి తాలూకు కాగితాలు రిజిష్టరు చేయించాను సార్! రిజిష్టరాఫీసులో నేను సంతకాలు కూడా చేశాను. రెండు రోజులు ఆఫీసు చుట్టూ తిరిగాను. అందరూ సాక్ష్యమున్నారు."

"సరే, నువ్వు చెప్పిన విషయాలు అబద్ధమని రుజువయితే నీ సంగతి అంత తేలిగ్గా వదలం. ఆ విషయాలు తేలేవరకు నిన్ను కష్టడీలో వుంచుతాం" అన్నాడు శ్రీనివాస్.

యల్లమంద ఏడుపుముఖం పెట్టాడు.

ఇంతలో ఫోన్ మోగింది.

శ్రీనివాస్ ఎత్తాడు. "హల్లో!" అన్నాడు.

అవతలి నుంచి చెప్పిన విషయాన్ని వింటుంటే అతని భ్రుకుటి ముడిపడింది.

"అలాగా, ఇప్పుడే వస్తున్నాం" అన్నాడు ఫోన్

పెట్టేసి.

"హాస్పిటల్లో వున్న శశిధర్ మీద గతరాత్రి హత్యా ప్రయత్నం జరిగిందట. డ్యూటీ డాక్టరు ఫోన్ చేశాడు" అన్నాడు శ్రీనివాస్ కిరణ్ తో.

కిరణ్ ఆశ్చర్యంగా చూశాడు.

"ఆ హత్యా ప్రయత్నం చేసిన వ్యక్తిని పట్టుకున్నారా?"

"లేదు. పారిపోయాడట. పోయి వివరాలు సేకరించి వద్దామా?"

"పద, వెళ్దాం."

ఇద్దరూ బయటికొచ్చి జీప్ ఎక్కారు.

ఉస్మానియా హాస్పిటల్ చేరారు.

8

శశిధర్ బెడ్ మీద అనిమిత్తంగా కదులుతున్నాడు.

పోలీసుల్ని చూడగానే లేచి కూచున్నాడు.

"ఏమిటి శశిధర్ గారూ! డాక్టర్ గారు ఫోన్ చేసి మీమీద హత్యాప్రయత్నం జరిగిందని చెప్పారు!?" అడిగాడు శ్రీనివాస్.

"అవును సార్! హంతకుడు నన్ను వదిలిపెట్టేలా లేడు. రవిని పొట్టనబెట్టుకున్నట్టే నన్నుకూడా మట్టుపెట్టడానికి కంకణం కట్టుకున్నాడు."

"ఏం జరిగింది చెప్పండి."

"నిన్న రాత్రి రెండుగంటల సమయంలో బాత్రూంకి వెళ్ళాల్సి లేచాను. బాత్రూంలో లైటు లేదు. చీకట్లో ఎవరో వ్యక్తి నిల్చుని వున్నాడు. నేను లోపలికి వెళ్తుండగానే కత్తి పుచ్చుకుని మీదపడ్డాడు. నేను కేకలు వేశాను. తక్కిన పేషెంట్లు, డ్యూటీ నర్సు, డాక్టరు

పరుగెత్తుకు వచ్చారు. వాడు పారిపోయాడు. అంతటా వెతికారు. చిత్రంగా మిస్సయ్యాడు, అందరు చూస్తూండగానే!" చెప్పాడు.

అతడు చెప్పినదాన్ని తక్కిన పేషెంట్లు, డ్యూటీ నర్సు కూడా బలపరిచారు.

"మీరతన్ని గుర్తుపట్టారా?"

"గుర్తుపట్టాను. జేమ్స్."

"జేమ్సా? అంటే మీ వీధిలోని...."

"అవున్సార్, అతనే! అతనెప్పట్నుంచో నా మీద పగబట్టి వున్నాడు. మొన్న లారీ నడిపింది కూడా అతనే అని నా అనుమానం."

"చైతన్య అని అనుమానించారు కదూ!"

"కాదని యిప్పుడనిపిస్తోంది."

"మీ కీ విషయం తెలుసా? చైతన్యని ఎవరో హత్య చేశారు. అదీ లారీ ఏక్సిడెంటే!"

శశిధర్ నిర్ఘాంతపోయి చూశాడు.

"అలాగా? అరెరే! ఎప్పుడు సార్!"

"నిన్న సాయంత్రం. అతనే కాకుండా రాఘవులు అనే మరో వ్యక్తిని కూడా లారీ ఏక్సిడెంట్‌లో చంపేశారు." చెప్పాడు శ్రీనివాస్.

శశిధర్ యింకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు.

"ఇదంతా చూస్తూంటే అంతా ప్లాన్ చేసుకుని చేస్తున్నట్టుగా వుంది సార్! నా మీద జేమ్స్ ఎందుకింత కక్ష పెట్టుకున్నాడో అర్థం కాదు" నిట్టూర్చాడు శశిధర్.

"జేమ్స్ విషయం మేము తేల్చుకుంటాం. మీరు జాగ్రత్తగా వుండండి, ఎందుకయినా మంచిది" అన్నాడు శ్రీనివాస్. శశిధర్ యిద్దరికీ నమస్కరించాడు.

పది నిమిషాల తర్వాత బేగంపేట్‌లో వున్న రాఘవులు యింటికి వెళ్ళారు కిరణ్, శ్రీనివాసులు.

ఇంట్లో స్మశాన నిశ్శబ్దం తాండవిస్తోంది.

"ఈమె రాఘవులి భార్య. ఏమడగాలి?" అన్నాడు శ్రీనివాస్ ఓ పాతికేళ్ళ యువతిని చూపించి.

ఆమె లేచి నమస్కరించింది. భర్త వియోగంతో ఆమె బాగా డీలా పడిపోయింది. ముఖమంతా పీక్కుపోయి వుంది.

"చూడమ్మా. నీ భర్త నెవరో కావాలని హత్య చేశారు. నీ భర్తకు శత్రువు లెవరున్నారో, నువ్వు ఎవర్ని అనుమానిస్తున్నావో చెప్పు."

"నా భర్త యెవరికీ హానిచేసే మనిషి కాదు. ఎవరూ శత్రువులు లేరు. ఎవర్నని అనుమానించను?" అన్నదామె. ఆమె స్వరంలో నిర్లిప్తత, నిరాసక్తత కిరణ్ గమనించాడు.

"మీ యింటికి వీళ్ళలో యెవరయినా యెప్పుడయినా వచ్చారా?" అంటూ జేమ్స్ ఫోటోని, శశిధర్ ఫోటోని, రవి ఫోటోని విడివిడిగా చూపించాడామెకి కిరణ్.

ఆమె తల అడ్డంగా తిప్పింది రాలేదని. వాళ్ళ పేర్లు కూడా ఎప్పుడూ వినలేదని చెప్పింది.

"ఓకే! మీ భర్తగారి చావుకి కారకు లెవరో మీ కనుమానం లేదన్నమాట! మేం తెలుసుకుంటాం లెండి" అన్నాడు శ్రీనివాస్.

ఇద్దరూ పోలీస్టేషన్ కొచ్చేసరికి సార్జంటు శివం ఓ కొత్త విషయం చెప్పాడు.

"లారీ ట్రేస్ అయింది సార్! దాని ఓనరు కడియాల అప్పలకొండ అని పెద్ద బిజినెస్ మేన్. మొన్న

సాయంత్రం 4 గంటల సమయంలో లారీ నెవరో దొంగి లించారట. దాని విషయం రిపోర్టు కూడా చేశాడట" అన్నాడు శివం.

"నాకేమీ తలాతోకా అందటం లేదు. ఇప్పటివరకు యీ జరిగిన ఏక్సిడెంటు గురించి ఆలోచిస్తూంటే ప్రమాదవశాత్తు జరిగాయేమో ననిపిస్తోంది. మనమే కావాలని వాటిగురించి డీప్ గా పోయి తలనొప్పి తెచ్చుకుంటున్నామేమో!" అన్నాడు శ్రీనివాస్.

కిరణ్ మందహాసం చేశాడు.

"అంతలోనే నిరాశపడిపోకు మైడియర్ ఇన్ స్పెక్టర్! ఇవి క్లియర్ మర్డర్సు. ఓసారి సింహావలోకనం చేద్దాం. మొదటిది రవి మర్డర్. అవకాశాలున్న అనుమానితులు చైతన్య, యల్లమంద, జేమ్స్. కాని చైతన్యని కూడా యేక్సిడెంట్ కి గురిచేశాడు హంతకుడు. యల్లమందకు రిజిష్టరాఫీసు జడ్చర్లలో తిరుగులేని ఎలిబీ వుంది.

ఇకపోతే జేమ్స్: అతనికి రవిని చంపాల్సిన అవసరం కనిపించదు. పోనీ శశిధర్ గురించి యేక్సిడెంట్ సృష్టించాడా అనుకుంటే, అసలు శశిధర్ కి హాని కలగలేదు.

అయితే చైతన్యని ఎవరు చంపినట్టు? జేమ్స్కి, చైతన్యకు ఏమిటి కక్షలు? జేమ్స్కి రాఘవులుకి ఏం కక్ష? రాఘవులి భార్య జేమ్స్ని గుర్తుపట్టలేదు. అంటే రాఘవులు ఎవరో జేమ్స్కి తెలీదు.

అంటే యీ మూడు హత్యలు, నాలుగో హత్యా ప్రయత్నం—ఒకే వ్యక్తి చేసినవి కాదని నిర్ధారించుకోవాల్సి వస్తుంది. కాని హత్యల కుపయోగించిన లారీ ఒకటే కాబట్టి, హంతకుడూ ఒకడేనని అనుకోవాల్సి వస్తోంది. ఏమంటావు?" అన్నాడు.

శ్రీనివాస్ రెండు అరచేతుల మధ్య తల యిరికించి "నాకు ఏమీ పాలుపోవటంలేదు. ఇప్పటిదాకా జరిగిన యీ ఏక్సిడెంట్లు ఏమిటో, వీటికి మోటివ్ ఏమిటో అర్థం కాకుండా వుంది" అన్నాడు.

"ఓసారి రవి భార్యని కలిసి కొన్ని విషయాలు సేకరించాలి. అడ్రసుందా?"

"ఆమె పుట్టింటివాళ్ళదేనా, రాసుకో. నేను రానా లేకుంటే...."

"అక్కర్లేదు. దగ్గరేగా, నే పోయొస్తాను" అన్నాడు కిరణ్.

9

"రండి సార్, ఏమైనా ఆమాకీ తెలిసిందా?"

"ఆఁ! జేమ్స్‌మీద మాకు అనుమానం వచ్చింది. తర్వాత మీమీద హాస్పటల్లో హత్యాప్రయత్నం చేశాడనగానే అనుమానం బలపడింది. అతనికి, చైతన్యకూ ఏమయినా మనస్పర్థలున్నాయా?" అడిగాడు కిరణ్.

శశిధర్ ఓ క్షణం ఆలోచించి, "గతంలో చైతన్యను కూడా ఓసారి నాలాగే ట్రాప్ చెయ్యబోయింది లూసీ. అతను కూడా ఆమెకు వార్నింగిచ్చాడు. జేమ్స్‌తో చెప్పి అతన్నికూడా కొట్టించబోయింది. ఆమెది చాలా చంచల స్వభావం సార్!" అన్నాడు.

కిరణ్ సాలోచనగా తలూపి, "అలాగా! అయితే ఆ రాఘవులుని ఎందుకు చంపాడో అర్థంకాకుండా వుంది" అన్నాడు.

"రాఘవు లంటే గుర్తొస్తోంది. తాలూకాఫీసులో జూనియర్ అసిస్టెంటుగా చేస్తాడు. అయనేనాండీ?" అన్నాడు శశిధర్ ఏదో గుర్తుకు తెచ్చుకుంటూ.

"అవునండి! మీకు తెలుసా....?" అన్నాడు శ్రీనివాస్.

"ముఖపరిచయముంది."

"ఆయనకు జేమ్స్‌కి ఏమయినా వ్యక్తిగత స్పర్ధలున్నాయా?"

"ఉంటే వుండొచ్చునండి! అసలే జేమ్స్ తాగుబోతు. ఎప్పుడెలా ప్రవర్తిస్తాడో ఎవరికి విరోధి అవుతాడో అతనికే తెలీదు."

కిరణ్ శ్రీనివాస్ వంక తిరిగి, "ముందు వెంటనే జేమ్స్‌ని రిమాండ్‌లోకి తీసుకో! జరిగిన హత్యలన్నిటికీ అతనే కారకుడని నిరూపించగల ఆధారాలు మన దగ్గిరున్నాయి" అన్నాడు.

శ్రీనివాస్ వెంటనే, "ఎస్! ఇప్పుడే అరెస్టు చేయిస్తాను" అన్నాడు బయటికెళ్తూ.

10

రాత్రి పదిగంటలయింది.

శశిధర్ హాస్పిటలు బెడ్ మీద లేచి కూచున్నాడు.

మెల్లిగా బయటకి వచ్చాడు.

అయిదు నిమిషాల తర్వాత మెటడార్ వాన్ వచ్చి ఆగింది. ఎక్కి కూచున్నాడు. శరవేగంతో కాలివాహన నగర్ చేరింది వాన్.

జేమ్స్ యింటిముంది ఆగింది.

శశిధర్ వాన్ దిగాడు.

వీధంతా నిర్మానుష్యంగా వుంది. లోనికి అడుగులు వేశాడు. జేమ్స్ యింటి తలుపులు మూసి వున్నాయి. కాలింగ్ బెల్ నొక్కాడు. తలుపులు తెరచుకున్నాయి.

లూసీ బయటికి తొంగిచూసింది.

"ఎవరూ?" అన్నది.

మెటడార్ వేన్ డ్రైవర్ గుమ్మం ఎక్కాడు. వెనుక నుంచి లూసీ నోరు నొక్కేశాడు. ఆమె గింజుకుంది. శశిధర్ ఆమె కాళ్ళవైపు పట్టుకున్నాడు.

డ్రైవర్, శశిధర్ లూసీని వేన్ లోపల పడేశారు. నోట్లో గుడ్డలు కుక్కారు. చేతులు వెనక్కి విరిచి కట్టారు.

వేన్ కదిలింది. ముందు కురికింది.

లూసీ గింజుకుంటోంది.

శశిధర్ నవ్వాడు. వికటంగా నవ్వాడు.

"ఏం, యిప్పుడు నీకెవడు తోడొస్తాడు? ఆ రోజు నిన్ను నేను కోరినందుకు నా మొహం మీద ఉమ్మేస్తావా? పెద్ద పతివ్రతలా కబుర్లు చెపుతావా? మీ అన్నను నా మీదకు కత్తి నిచ్చి పంపుతావా? నేనేనా అంత చేవ చచ్చినవాడ్ని!

సమయంకోసం కాచుకున్నాను. అవకాశం దొరికింది. మీ అన్నని హత్యకేసుల్లో యిరికించాను. నీకు ఈ రోజు మానభంగం తప్పదు. నేనొక్కడినే కాదు. పక్కన నా ఫ్రెండు వాసు కూడా ఉన్నాడు.

"వాసు ఎవరో నీకు చెప్పలేదు కదూ! ఎలాగూ కొద్ది నిమిషాల తర్వాత చస్తావు కదూ! నీకు చెప్పటంవల్ల ప్రమాదంలేదు. వాసు నాప్లాన్ విజయవంతంగా చెయ్యటానికి ఉపయోగపడిన బెస్టు ఫ్రెండు.

రవిని పైలోకానికి పంపించటానికి నా పథకాన్ని తు.చ. తప్పకుండా! అమలుపరచిన మంచి మిత్రుడు. అయితే నాకు కూడా స్వల్పమైన గాయాలు తగిలాయనుకో! అది కూడా నా ప్లాన్‌లో ఓ భాగమే!

రవిలాగే నా దారికి అడ్డొచ్చిన మరో రాస్కెల్ చైతన్య. కావటానికి దూరపు బంధువే! అయితే, నన్ను చీప్ గా అల్లుడిగా కొట్టేయ్యాలని ప్లాన్ వేశాడు. నేను పదిహేను వేల కట్నం అడగ్గానే ప్లేటు ఫిరాయించేశాడు. వాడి మామ నాకు బాస్. వాడిచేత నన్ను ఆఫీసులో అనుక్షణం వేధింపచేశాడు. నన్ను డిస్మిస్ చేయించాలని చూశాడు. అందుకే వాడినీ పైలోకానికి పంపించేశాను. అప్పుడూ పాపం వాసు సాయపడ్డాడు.

అయితే అనుకోకుండా ఓ అమాయకుడ్ని కూడా పైకి పంపేయాల్సి వచ్చింది. వాడితో బాటు మరో అమాయకుడు కూడా చచ్చాడు. ఒకడు రాఘవులు. మరొకడు ఆటో డ్రైవరు. రాఘవులు చైతన్యకి బెస్టు ఫ్రెండు.

వాళ్ళిద్దరు నేను, రవి యాదగిరిగుట్టకు వెళ్ళిన రోజునే అక్కడికొచ్చారు. వాసు లారీ డ్రయివ్ చెయ్యటం రాఘవులు, చైతన్య చూశారు. రవికి, నాకు డాష్ కొట్టటం కూడా చూశారు. అందుకే ఆ విషయం పోలీసులకి ఎక్కడ చెప్పేస్తారోనని అర్జంటుగా చైతన్యని, రాఘవుల్ని కూడా వాసు అడ్డు తొలగించాడు. నేను హాస్పిటల్లో వున్నాను గాబట్టి, నన్నెవరూ అనుమానించే అవకాశమే లేదు.

ఇక మీ అన్న మిగిలాడు. వాడంటే నాకసహ్యం, ఎలర్జీ కూడా—అందుకే ఈ హత్యలన్నిటికీ మీ అన్నే మూలకారకుడని పోలీసుల్ని, డిటెక్టివ్ కిరణ్ ని నమ్మించాను. ఈ హాస్పిటల్లో నామీద హత్యాప్రయత్నం చేసింది, జేమ్సు అని చెప్పాను. కాని ఆ అవతారం

ఎ తిండి కూడా వాసే. మా అన్నను పాపం పోలీసులు అరెస్టు చేశారు. నువ్వు ఒక్కదానివే యింట్లో మిగిలావు. అవకాశం దొరికింది. ఇద్దరం నిన్ను అనుభవించి ఆనక నీ శవాన్ని హుస్సేన్ సాగర్లో పారేస్తాం" వికటంగా నవ్వాడు శశిధర్.

వేన్ నిర్మానుష్యంగా వున్న ప్రదేశంలో ఆగింది.

"శేకీ ఆన్ వాసూ! వేన్ లోనే మన పని కానియ్యాలి. ఎంతో కష్టపడ్డవాడివి నువ్వు. ఫస్టు ఛాన్సు నీదే! లూసీ నిజంగా చిలక కొరకని బంగినపల్లి మామిడిపండు. రుచి చూడు" అన్నాడు శశిధర్.

వాసు డ్రయివింగ్ సీట్లోంచి లేచాడు.

లూసీ మీద పడ్డాడు. లూసీ గింజుకుంది అరవబోయింది. నోట్లో గుడ్డలున్నాయి.

వాసు ఆమె చీర కుచ్చెళ్ళమీద చెయ్యివేశాడు.

"హేండ్సప్!" అని వినిపించింది గంభీర స్వరం.

ఇద్దరు ఉలిక్కిపడి చూశారు. వేన్ సీటు అడుగు నుంచి బయటికి వచ్చాడు డిటెక్టివ్ కిరణ్.

"నీ పాపపు చరిత్ర నీ నోటితోనే చెప్పుకున్నావు మిస్టర్ శశిధర్! స్నేహమనే పవిత్ర పదానికి కళంకం తెచ్చే నిన్ను ఉప్పు పాతర వేసినా పాపంలేదు. కదలకు, కాల్చేస్తాను" అన్నాడు కిరణ్ రివాల్వర్ సూటిగా వాసు గుండెలకు గురిచేసి, శశిధర్ ని కూడా కవర్ చేస్తూ.

కాని, ఊహించని రీతిగా వాసు ఒక్కసారిగా కాలితో కిరణ్ చేతిమీద తన్నాడు. రివాల్వర్ ఎగిరి వేన్ కిటికీలోంచి రోడ్ మీద పడింది.

శశిధర్, వాసు యిద్దరు కిరణ్ మీద పడ్డారు.

వాసు కిరణ్ చేతిని మెలితిప్పాడు. నరాలు కరకర

మన్నాయి. శశిధర్ కిరణ్ నెత్తిమీద యినప రాడ్‌తో కొట్టబోయాడు ఎడమ చేతితో. కిరణ్ కాసుకున్నాడు. మరుక్షణం మెరుపులా శశిధర్ మీద లంఘించి అతని కుడిచేతిని మెలితిప్పాడు.

చెయ్యి పూర్తిగా విరిగి పోయింది శశిధర్‌కు. కుయ్యోమని చావుకేక వేసి మొదలు నరికిన చెట్టులా కూలిపోయాడు.

వెనుతిరిగి వాసు పొత్తి కడుపులో గుద్దాడు కిరణ్ — వాసు లుంగచుట్టుకు పడిపోయాడు. అంతలో నే స్ప్రింగులా లేచి పొడవాటి కత్తిని తీసి కిరణ్ పొట్టలో గుచ్చబోయాడు.

కిరణ్ వెంట్రుకవాసిలో పోటు తప్పించుకుని వాసు ముఖంమీద రెండు చేతులను బిగించి కొట్టాడు. వంద టన్నుల బరువు తగిలినట్టు బాధతో మూలిగాడు వాసు. ముక్కు నుంచి రక్తం వరదలా కారింది. అదే అదనుగా మరో రెండు పిడిగుద్దులు ఛాతీమీద గుద్దాడు. వాసు నేలకూలిపోయాడు.

సరిగ్గా ఆ దేసమయంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తన బలగంతో వచ్చి చేరాడక్కడికి.

"కమాన్ ఇన్‌స్పెక్టర్! ఇదిగో కేసెట్టులో తనంతట తను తన సాహసకృత్యాలని రికార్డు చేసుకున్నాడు శశిధర్! టేకిట్" అంటూ అంతదాకా శశిధర్ లూసీతో చేసిన ప్రగల్భాల ప్రసంగాన్ని శ్రీనివాస్‌కి అందించాడు కిరణ్.

లూసీ, డిటెక్టివ్ కిరణ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంది.

"బ్రదర్, శశిధరే హంతకుడని ఎలా గ్రహించావు? నేనసలు శశిధర్ నేరస్థుడని కలనైనా ఊహించలేను"

అన్నాడు శ్రీనివాస్.

"నేనూ మొదట్లో అనుకోలేదు. కాని లూసీని ఇంటర్వ్యూ చేసినపుడు ఆమె మాటల్లోని నిజాయితీనిబట్టి శశిధర్ అబద్ధం చెప్పాడనిపించింది. ఆ లైన్లోనే ఆలోచించాను. రవిని హత్య చేయాల్సిన అవసరం ఎవరి కుందని ఆలోచిస్తే అది శశిధర్ కే వుందనిపించింది.

రవిని ఎందుకు హత్యచేశాడో మోటివ్ దొరికింది. అందుకే రవి భార్య పుట్టింటికి వెళ్ళి ఆమెనుంచి వివరాలు సేకరించాను. స్నేహితుడి భార్య అన్న జ్ఞానంలేకుండా రవి భార్యని కూడా పాడు దృష్టితో చూశాడట. ఆమె కోసం కలపన్నాడట. ఆమె మందలించేకొద్దీ ఆమెమీద వ్యామోహం పెంచుకున్నాడట.

రవిని అడ్డుతొలగిస్తే ఆమె తనదవుతుందని, వాసు సాయంతో యాదగిరిగుట్టనుంచి వచ్చేటప్పుడు ఏక్సిడెంట్ సృష్టించారు. తను కూడా ఏక్సిడెంట్లో చిక్కుకుంటే యెవరూ అనుమానించరని అతని ప్లాను. మెటడార్ వాన్ కూడా వాసు ఫ్రెండుది. ఏక్సిడెంట్ కాగానే ఆ వాన్ సరిగ్గా స్పాట్ కొచ్చి శశిధర్ ని తీసుకుని హాస్పిటల్లో చేర్చి మళ్ళీ కనబడకుండా మాయమయింది.

అయితే, ఆ రోజు వాసు లారీ డ్రయివ్ చేస్తూండగా యాదగిరి గుట్టకు కాకతాళీయంగా అదే సమయానికి వచ్చిన చైతన్య, రాఘవులు చూశారు. అందుకని వాసు అర్జంటుగా వాళ్ళ అడ్డు తొలగించుకున్నాడు. హాస్పిటల్లో వుండటం శశిధర్ కు తిరుగులేని పటిష్టమైన ఎలిబీ. అందుకే ఎవరి అనుమానమూ శశిధర్ మీదికి పోలేదు.

"జేమ్స్ ని అరెస్టు చెయ్యమని నీతో మాటమాత్రంగా అన్నపుడు శశిధర్ లూసీ గురించి ప్రయత్నిస్తాడని

ముందుగానే ఊహించాను. అలాగే జరిగింది. నిన్న కొంత దూరంలో వేన్‌ని వెంబడించమని, నేను వాసు శశిధర్ లూసీని తీసుకొచ్చే సమయానికి వాన్ సీటుకింద దూరి వాళ్ళతో బాటు ప్రయాణం చేశాను. అతడు రెడ్ హాండెడ్‌గా పట్టుబడిపోయాడు." అన్నాడు కిరణ్.

—: అ యి పో యిం ది: —